

వేములవాడ: కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలోని నీటిని ఎత్తిపోస్తున్న మహిళా రైతు



కరీంనగర్: ఓటు అభ్యర్థిస్తున్న మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

# ముంచిన అకాలవాన

## కాంగ్రెస్ నిర్లక్ష్యం.. రైతన్నకు శాపం

### అన్నదాతకు దెబ్బ మీద దెబ్బ.. ఒడువని దుఃఖం

- ఉమ్మడి జిల్లాలో ఈదురుగాలుల బీభత్సం
- అకాల వర్షానికి తోడు పలుచోట్ల వడగండ్లు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వరదలో కొట్టుకుపోయిన వడ్లు
- సకాలంలో కొనకపోవడం వల్లే నష్టం
- కన్నీరు పెడుతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ధర్మారం: మార్కెట్ యార్డులో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు



చొప్పదండి: మార్కెట్ యార్డులో నీటిలో ధాన్యం

అన్నదాతకు దెబ్బమీద దెబ్బ తగులుతున్నది. కాంగ్రెస్ నిర్లక్ష్యానికి కన్నీరే మిగులుతున్నది. కొనుగోళ్లలో జాప్యం చేయడంతో అపార నష్టం వాటిల్లింది. మొన్నటి దాకా సాగునీరందక.. పంటలను కాపాడుకోలేక ఆగమైతే.. ఇప్పుడు అకాల వర్షం నిండా ముంచింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా ఈదురుగాలులతో బీభత్సం సృష్టించింది. రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొస్తే.. సకాలంలో కొనకపోవడం, సరైన వసతులు కల్పించకపోవడంతో ఎక్కడికక్కడ తడిసిపోయింది. అనేక చోట్ల వరదలో కొట్టుకుపోయింది. వారం పది రోజులుగా కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబోస్తూ కాపాడుకున్న రైతులు, ఇప్పుడు వాన నుంచి రక్షించుకునేందుకు తిప్పలు పడ్డారు. అయినా కండ్ల ముందే ధాన్యం తడిసిపోయిందని, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తమకీ దుస్థితి వచ్చిందని కన్నీరు పెడుతున్నారు. పదేళ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి రాలేదని, కొనుగోళ్లలో జాప్యం జరగలేదేని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం వెంట వెంటనే తూకం వేయకపోవడం వల్లే నష్టం జరిగిందని ఆగ్రహిస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనాలని డిమాండ్ చేస్తున్నారు. – పెద్దపల్లి, మే 7 (నమస్తే తెలంగాణ)



పెద్దపల్లి: మార్కెట్ యార్డులో నిలిచిన వర్షపు నీటిలో వడ్ల కుప్ప

### పెద్దపల్లి జిల్లా..

జిల్లాలో అకాల వర్షం అపార నష్టాన్ని తెచ్చిపెట్టింది. పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసింది. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోనూ ధాన్యం తడిసిపోయింది. తోటల్లో మామిడి కాయలు నేలరాలాయి. కొలనూర్‌లో జక్కుల రాజయ్యకు చెందిన ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. మంథని డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో గాలి దుమారంతో పాటు స్వల్పంగా వర్షం పడింది.



ఓదెల: ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన వడ్లను చూపుతున్న రైతులు



వేములవాడ: ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొట్టుకపోయిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

### సిరిసిల్ల జిల్లా

వేములవాడ రూరల్ మండలం బొల్లారం వద్ద భారీ చెట్లు రోడ్డుపైన విరిగి పడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గాలిదుమారంతో చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో చాలా గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. కోనరావుపేట మండలం వట్టిమల్లలో పిడుగుపాటుకు రైతు దాదె జలపతికి చెందిన గేదె చనిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. వీర్నపల్లితోపాటు గర్జ నపల్లి, రంగంపేట, అడవిపదిర, కంచర్లలో వడగండ్ల వాన పడింది. కోనరావుపేట మండలంలోని కొను గోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. నాగా రంతో పాటు పలు గ్రామాలలో చేతికొచ్చే సమ యంలో ఈదురుగాలులకు మామిడికాయలు నేలరా లాయి. వట్టిమల్ల, పలు తండాలలో రాళ్ల వర్షం పడింది.



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న మహిళా రైతు స్వరూప

### ప్రభుత్వమే ఆదుకోవాలె

మాది దస్తగిరిపల్లి. పది రోజుల కింద పెద్దపల్లి మార్కెట్ల వడ్లు పోసినం. కొనడానికి టైం పడుతదని అధికారులు అన్నరు. దీంతో రోజూ వడ్లను పొద్దంత ఎండపోసి, రాత్రి రాశిగా పోస్తున్నం. నిన్ననే (సోమవారం) మాయిచ్చర్ వచ్చింది. కానీ, బార్దాన్ ఇవ్వలేదు. చెడుగొట్టు వానతో వడ్లన్నీ తడిసిపోయినయి. నీటిలో కొట్టుకుపోయినయి. ప్రభుత్వమే ఆదుకోవాలి. తడిసిన వడ్లను మద్దతు ధర ఇచ్చి కొనాలె.

**- మేకల స్వరూప, రైతు, దస్తగిరిపల్లె (పెద్దపల్లి మండలం)**



గంగాధర మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

### కరీంనగర్ జిల్లా..

జిల్లాలో భారీ నష్టం వాటిల్లింది. ప్రధానంగా చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాల్లో అకాల వర్షం ముంచింది. చొప్పదండి, గంగాధర, గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్‌తోపాటు తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ ఐకేపీ సెంటర్‌లో ధాన్యం తడిసిపోయింది. గన్నేరువరం, చిగురుమామిడి మండలాల్లో మామిడి కాయలు నేలరాలాయి. బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరిస్థితిని పరిశీలించారు. శంకరపట్నం, చిగురుమామిడి మండలంలోనూ నష్టం వాటిల్లింది. మక్త, సీతారాంపూర్‌లో కరెంట్ స్తంభాలు విరిగాయి. కరీంపేట్, తదితర గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. చిగురుమామిడి మండలం రేకొండ, సీతారాంపూర్, లంబాడి పల్లె తదితర గ్రామాల్లో ఆస్తి నష్టం జరిగింది. లంబాడిపల్లి, రేకొండ, చిగురుమామిడి దారుల్లో చెట్లు విరిగి పడ్డాయి. రేకొండలో అల్లెపు రాములు, సందెవేని పద్మ ఇంటి పైకప్పులు లేచి పోయాయి. చిగురుమామిడి రేకొండ రహదారిపై చెట్టు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సైదాపూర్ మండలం సర్వాయిపేటలో విద్యుత్తు లైన్లు తెగిపడ్డాయి. వేముల నర్సయ్య, వేముల కొండయ్య ఇంటిపై కప్పులు ఎగిరి పోయాయి. వెన్కపల్లిలో ధాన్యం కుప్పలు తడిశాయి..



ధర్మారం, బొమ్మారెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



### కండ్ల ముందే తడిసిపాయె

మాది నందిమేడారం. నాకు భూమి లేదు. ఊళ్లె పదెకరాలు కౌలుకు తీసుకుని వరి వేసిన. మొన్ననే కోసి 15 ట్రిప్పుల ధాన్యం ధర్మారం వ్యవసాయ మార్కెట్‌కు తెచ్చిన. ఇయ్యాళ పొద్దుగాలనే మబ్బుపడ్డది. బ్లేడ్ ట్రాక్టర్ తెచ్చి ధాన్యాన్ని కుప్పగా పోద్దామనుకున్న. అంతలోనే మధ్యాహ్నం బాగా కొట్టి కండ్లముందే ధాన్యం తడిసిపాయె. ట్రాక్టర్ లోడ్ వడ్లు వరదలో కొట్టుకుపోయినయి. ఏం చేసుడు? ఎట్ల చేసుడు? నన్ను ప్రభుత్వమే ఆదుకోవాలి. నష్టపరిహారం ఇయ్యాలె. తడిసిన ధాన్యాన్ని కొనాలె.

**- ధనిశెట్టి లచ్చయ్య రైతు, నంది మేడారం (ధర్మారం)**



గంగాధర: బూరుగుపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

### టైంకు కొంటే ఈ నష్టం జరిగేది కాదు

నేను పెద్దపల్లి మార్కెట్‌కు తొమ్మిది రోజుల కింద వడ్లు తెచ్చిన. ఆరబెట్టిన. మూడు రోజుల కింద మాయిచ్చర్ వచ్చింది. సంచులు ఇస్తే వడ్లు నింపుతా అని అడిగినా సెంటర్ నిర్వాహకులు పట్టించుకోలే. లారీలు వస్తలేవని, హమాలీలు లేరని బార్దాన్ ఇవ్వలేదు. ఇప్పుడు వర్షానికి తడిసిపాయె. ఎవరిదీ బాధ్యత? మాయిచ్చర్ వచ్చినప్పుడే గోనే సంచులు ఇచ్చి తూకం వేస్తే నాకీ నష్టం జరిగేది కాదు. సెంటర్ల నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ గోస వచ్చింది.

**- కోల కమలాకర్, రైతు (పెద్దపల్లి)**



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు కమలాకర్

### జగిత్యాల జిల్లా..

జిల్లాలో అక్కడక్కడ మాత్రమే ఎఫెక్ట్ కనిపించింది. పెగడపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. మామిడి కాయలు నేల రాలాయి. ఆరవల్లిలో రైతు కట్ల రాజేందర్‌కు చెందిన రెండెకరాల మక్క నేలవాలింది. నంచర్లలో తాటి చెట్టు విరిగి, విద్యుత్ స్తంభంపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మల్లాపూర్–ఖానాపూర్ మధ్య రోడ్డుపై చెట్లు విరిగిపడ్డాయి. మల్లాపూర్ మండల కేంద్రంలో గాలికి మామిడికాయలు పూర్తిగా నేలరాలాయి.



కోరుట్ల రూరల్: పైడిమడుగులో నేలరాలిన మామిడికాయలు

### ఇరువై రోజులైనా కొనలె.. ధాన్యం తడిసిపాయె



నాకు ఎవుసపు భూమి లేదు. మా ఊళ్లే రెండున్నర ఎకరాల కౌలుకు తీసుకున్న. యాసంగిల వరి ఏసిన. ఇరువై రోజుల కింద వడ్లను గ్రామంలోని కేంద్రానికి ధాన్యం తెచ్చిన. కానీ, ఏం లాభం? కొనుగోళ్లలో మస్తు జాము చేస్తున్రు. మునుపటి లెక్క వెంటనే కొంటలేరు. నా లైన్ ఎప్పుడు వస్తదా..? రోజుల తరబడి ఇక్కనే ఉంటున్న. తీరా ఇయ్యాల వానపడి వడ్లన్నీ తడిసినయి. కొన్నివడ్లు వరదలో కొట్టుకపోయినయి. ప్రభుత్వం నన్ను ఆదుకోవాలి. కొట్టుకుపోయిన ధాన్యానికి పరిహారం ఇచ్చి, తడిసిన ధాన్యం మొత్తం కొనాలి.

**- గాదెం రాజయ్య, కౌలు రైతు, ఆరవల్లి (పెగడపల్లి మండలం)**

# వినోద్‌కుమార్‌ను గెలిపించండి

- ముస్లింలకు అండగా నిలిచింది బీఆర్ఎస్సే
- కాంగ్రెస్‌ను మళ్లీ నమ్మి మోసపోవద్దు
- మాజీ హోం మంత్రి మహమూద్ అలీ
- కరీంనగర్‌లో ఇంటింటా ప్రచారం

కరీంనగర్ కార్పొరేషన్, మే 7 : రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధి, సంక్షేమం జరిగిదంటే అది కేవలం కేసీఆర్ పాలనలోనేనని, అన్ని సమయాల్లోనూ మైనార్టీలకు బీఆర్ఎస్సే అండగా నిలిచిందని రాష్ట్ర మాజీ హోం మంత్రి మహమూద్ అలీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ మైనార్టీల ఓట్లు దండుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. మైనార్టీలకు అండగా నిలిచే బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు ఈ ఎన్నికల్లో ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంగళవారం ఉదయం కరీంనగర్‌లోని 43, 45 డివిజన్లు కశ్మీర్‌గడ్డ, అశోక్‌నగర్, రైతుబజార్ ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను వివరిస్తూ మరోసారి మోసపోవద్దని సూచించారు. ఆ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ బీఆర్ఎస్‌ను బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎప్పటికీ బీజేపీతో కలిసే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నది కేసీఆర్ మాత్రమేనని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలోనే ముస్లింల ఆడపిల్లల పెళ్లిళ్లకు షాదీముబారక్ ఇచ్చారని, మళ్లీ తిరిగి చెల్లించే అవసరం లేకుండా రుణాలు ఇచ్చారని గుర్తు చేశారు. అలాగే, వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసి మైనార్టీల అభ్యున్నతి కోసం పని చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అక్బర్‌హుస్సేన్, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్ఎస్ నాయకులు జమీలొద్దీన్, యూసుఫ్, నవాజ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

### అందరికీ అందుబాటులో ఉంటా

నేను ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ ద్వారా రూ.వెయ్యి కోట్ల నిధులు తీసుకువచ్చిన. నగరంలోని అన్ని డివిజన్లలోనూ సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా చేయించేందుకు ఈ నిధులు వినియోగించిన. నన్ను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా గొంతుకగా నిలుస్త. ఎప్పుడూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంట. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్త. మైనార్టీల సంక్షేమానికి పాటుపడుత.

**- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్**












# మోసాల కాంగ్రెస్‌ను తరిమికొట్టండి

- అబద్ధాల హామీలతో గద్దెనెక్కి మళ్లీ వస్తున్నది
- మరోసారి నమ్మి మోసపోవద్దు
- కేసీఆర్ నేతృత్వంలోనే ప్రజా సంక్షేమం
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



గోదావరిఖనిలోని కూరగాయల మార్కెట్‌లో ఓటు అభ్యర్థిస్తున్న పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మే 7 : అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, మళ్లీ దొంగ హామీలతో వస్తున్న ఆ పార్టీని తరిమికొట్టాలని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. మన కోసం, మన అభివృద్ధి కోసం పని చేసే నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. మంగళవారం పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో విస్తృత ప్రచారం చేశారు. ఉదయం గోదావరిఖనిలోని కూరగాయల మార్కెట్‌లో ఓట్లు అభ్యర్థించారు. వ్యాపారులు, కూలీలను ఆప్యాయంగా పలుకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం 9వ డివిజన్ పరిధిలోని జనగామలోనూ ప్రచారం చేశారు. శివాలయంలో పూజలు చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. తర్వాత ఖనిలో న్యాయవాదులు, ఆటోడ్రైవర్లతో వేర్వేరుగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. రాత్రి కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటిలో సంతోషం వెల్లివిరిసిందని తెలిపారు. కానీ, కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ అనాలోచిత నిర్ణయాలతో ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు. పంటలు ఎండిపోయి రైతులు చనిపోయినా.. ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసిన ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. అబద్ధాలతో గద్దెనెక్కిన ఆ పార్టీని మరోసారి నమ్మి మోసపోవద్దని, ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రైతులు, మహిళలు, యువకులను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం ఒకరు, అధికారం కోసం మరొకరి మధ్య జరుగుతున్న పోటీగా ఈ ఎన్నికలను గుర్తించాలని సూచించారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో వినిపించే విధంగా ప్రజా గొంతుక అయ్యే అవకాశం తనకు కల్పించాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుడిగా పని చేసిన సౌమ్యుడు, పోరాట బిడ్డ కొప్పుల ఈశ్వర్ ఎంపీగా ఉంటేనే మనందరికీ ఒక ధైర్యంగా ఉంటుందని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తున్న ఈశ్వర్‌కు మద్దతుగా నిలిచి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెంట రాజేశ్, నాయకులు మారుతి, అచ్చ వేణు, నూతి తిరుపతి, తోట వేణు, వంశీకృష్ణ, కిషన్ తదితరులున్నారు.